ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
3
బుధవారం 14 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.146	212	241
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.146	212	241

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 | కనిష్ఠం 19.4


సభలో మాట్లాడుతున్న కేసీఆర్, పాల్గొన్న నాయకులు

ఫ్లోరైడ్ పీడ విరగడ
బీఆర్ఎస్ హయాంలోనే

- నల్లగొండలో నాడు ఆముదాలు, బత్తాయితోటలే ఉండేవి
- ధాన్యపురాశుల కేంద్రంగా మార్చాం
- ప్రజలపక్షాన పోరాడతాం
- మంత్రులు సోయిలేకుండా మాట్లాడుతున్నారు
- మాజీ సీఎం కేసీఆర్

'పొరుగున కృష్ణానది ప్రవహిస్తున్నా నల్లగొండ జిల్లాకు ప్రత్యేక రాష్ట్రం వచ్చేంతవరకు గుక్కెడు తాగునీరు ఇవ్వలేకపోయారు.. ఇదే జిల్లాలో లక్షన్నర మంది మునుగోడు, దేవరకొండ ప్రజలు ఫ్లోరోసిస్ మహమ్మారితో నడుములు వంగి చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలతో ఉండేవారు.. చివరికి ఇక్కడి ఉద్యమకారులు ఫ్లోరైడ్ బాధితులను నాటి ప్రధాని టేబుల్‌పై పడుకోబెట్టి సమస్య వివరించినా ఏమీ చేయలేదు.. నాడు మంత్రులు, ఎమ్మెల్యేలున్నా ఏమీ చేయలేకపోయారు.. చివరికి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ఫ్లోరైడ్ పీడ విరగడైంది' అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం నల్లగొండలో జరిగిన 'కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల సాధన సభ'లో కేసీఆర్ మాట్లాడారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో వచ్చిన కేసీఆర్, కాలునొప్పికారణంగా చేతికర్ర సాయంతో నెమ్మదిగా సభావేదికపైకి వచ్చారు. సభకు అన్నివైపులా ప్రజలకు అభివాదం చేసి, ఆరోగ్యం బాగోలేనందున కుర్చీలో కూర్చొని మాట్లాడవచ్చా.. అని సభికులను అడిగి ఆమోదం తీసుకున్నారు. ఆ తరువాత కుర్చీలో కూర్చొని సుమారు 40నిమిషాలపాటు మాట్లాడారు. ఒక నాడు నల్లగొండ జిల్లాలో ఆముదాలు, బత్తాయిల తోటలతోనే రైతులు బతికేవారని, కానీ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నల్లగొండ నాలుగు లక్షల టన్నుల ధాన్యాన్ని పండించే జిల్లాగా తీర్చిదిద్దామన్నారు. వచ్చిపోయే విద్యుత్ స్థానంలో 24గంటలు నిరంతరాయంగా సరఫరా చేశామని, ఇంటింటికీ తాగునీటి నల్లాలు పెట్టామన్నారు. దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు ఉద్దేశించిన డిండి ఎత్తిపోతల పథకం దాదాపు 80శాతం పూర్తయిందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేసేంతవరకు ప్రస్తుత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామని పేర్కొన్నారు. మరోవైపు భువనగిరి వద్ద బస్వాపూర్ రిజర్వాయర్ పూర్తయిందని, గోదావరి జలాలతో ఆ ప్రాంతానికి నీరిచ్చామన్నారు. దామరచర్ల వద్ద 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ చేపట్టామని, 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మరో రెండు నెలలు పనులు చేస్తే ఆ ప్లాంట్ ద్వారా 4వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా, పదేళ్లలో ఎంతో కష్టపడి అన్నింటినీ ఎదుర్కొని రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపామని వివరించారు. కృష్ణాజలాల్లో హక్కుల సాధన జీవన్మరణ సమస్య అని, బతుకు పోరాటమని అన్నారు. నదీ జలాలపై హక్కుల కోసం ఊపిరి ఉన్నంతవరకు పోరాడతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మంత్రులు సోయిలేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో ఉమ్మడి రాష్ట్రంలోనే బాగుండేనని వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడే బాగుంటే, ఇదే జిల్లాకు చెందిన శ్రీకాంతాచారి ఎందుకు అమరుడయ్యేవాడని, ఇంత పెద్ద ఉద్యమం ఎందుకు వచ్చేదని ప్రశ్నించారు. రైతు బంధు నిధుల కోసం అడిగితే రైతులను చెప్పుతో కొడతామంటున్నారని, కానీ రైతులు కూడా చెప్పులతో కొడితే 32 పళ్లు రాలిపడతాయని హెచ్చరించారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, తమకంటే నాలుగు ఎక్కువ మంచిపనులు చేసి ప్రజల మెప్పుపొందేందుకు కాంగ్రెస్ యత్నించాలని హితవు పలికారు. ప్రతిపక్షంలో ఉండాలని ప్రజలు తీర్పిచ్చారని, ప్రజల హక్కులు, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై ప్రతిపక్షంగా పోరాడతామన్నారు. కాంగ్రెస్ ఐదేళ్లు అధికారంలో ఉండి పాలించాలని, వారిని సమస్యలపై వెంటాడతామని, బలాదూర్ తిరిగితే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అప్పటివరకు ప్రతిపక్ష పాత్రను సమర్థంగా నిర్వహించాలని క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు.


సభలో కేసీఆర్ అభివాదం

సభ సక్సెస్‌తో బీఆర్ఎస్ నేతల్లో సమరోత్సాహం

రాష్ట్రంలో అధికారం కోల్పోయి ప్రతిపక్షంలోకి వచ్చాక, మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో నిర్వహించిన తొలిసభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఉమ్మడి జిల్లాకు జీవన్మరణ సమస్యగా పేర్కొంటున్న కృష్ణాజలాల హక్కుల సాధనకు పోరాడేందుకు స్వయంగా కేసీఆర్ నల్లగొండను కార్యక్షేత్రంగా ఎంచుకోవడంతో ప్రతిపక్షంగా బలమైన గొంతుకను నల్లగొండ నుంచి వినిపించినట్లయిందని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లోనూ ఉమ్మడిజిల్లాలో ప్రజల తరఫున బలమైన ఉద్యమాలు నిర్వహించేందుకు ఈ సభ నైతిక మద్దతు ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు సమన్వయంతో సభ విజయవంతానికి కృషి చేశారు.

రెండు నెలలుగా సాగర్‌ను ఎవ్వరూ పట్టించుకోలేదు

- అనారోగ్యాన్ని లెక్కచేయకుండా బెబ్బులిలా వచ్చిన కేసీఆర్
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



నల్లగొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు అవతలి చేతికి వెళ్తుంటే రెండు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరూ పట్టించుకోలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలో జరిగిన కృష్ణాజలాల పరిరక్షణ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు కరువు, ఆకలి చావులను పెంచితే కేసీఆర్ సీఎం అయ్యాక నల్లగొండ జిల్లా నుంచి వాటిని తరిమికొట్టారన్నారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ పాలనలో ఫ్లోరోసిస్ మహమ్మారితో చాలా మంది చనిపోయారని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మార్చారన్నారు. నల్లగొండ జిల్లాలో 3లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి నుంచి 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యేలా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా బెబ్బులిలా పోరాటం చేయడానికి వచ్చారన్నారు. కేసీఆర్ నల్లగొండకు వస్తున్నారనగానే కాంగ్రెస్ నేతలకు భయం పట్టుకొని నోటికివచ్చినట్టు చెత్తగా మాట్లాడుతున్నరన్నారు. కేసీఆర్ ఇచ్చిన 24 గంటల విద్యుత్‌ను మాయం చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు.

కాంగ్రెస్ నిర్ణయం గొడ్డలిపోటు

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



నల్లగొండ: సాగర్‌ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్రానికి గొడ్డలిపోటు లాంటిదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ, తొమ్మిదిన్నర ఏళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం సహకరించకుండా, కృష్ణాజలాల్లో వాటా తేల్చకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మిషన్‌కాకతీయ కింద 46వేల చెరువులకు పునరుజ్జీవం కల్పించామన్నారు. గతంలో నల్లగొండ జిల్లాలో 1,200 ఫీట్లలో బోరు వేసినా నీళ్ల పడకపోయేవని, చెరువుల్లో పూడిక తీతతో బోర్లలో నీళ్ల పెరిగాయన్నారు. కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. నల్లగొండ సభ రాజకీయ ప్రేరేపిత సభ కాదని, కృష్ణాజలాల్లో హక్కుల సాధన, పరిరక్షణ కోసం జరిగిన సభ అన్నారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందన్నారు. సభలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు కేటీఆర్, హరీష్‌రావు, మహమూద్ అలీ, కేశవరావు, కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, నామా నాగేశ్వరరావు, సంతోష్ కుమార్, బండా నరేందర్‌రెడ్డి, గాదరి కిషోర్, రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌లను పూర్తి చేయకుండా
మోసం చేసిన కేసీఆర్

డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

కుర్చీలో కేసీఆర్ ఫొటో పెట్టి కాంగ్రెస్ నిరసన


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13: గత పదేళ్లుగా అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేసిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. నల్లగొండలో కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభను నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఖాళీ కుర్చీలో గులాబీ రంగు టవాల్ వేసి కేసీఆర్ ఫొటో పెట్టి గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను వివరిస్తూ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ గోబ్యాక్ అంటూ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. కేసీఆర్‌వన్నీ దొంగ హామీలని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి శ్రీశైలం టన్నెల్‌ను కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు. డిండి ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయని కేసీఆర్‌కు నల్లగొండలో అడుగుపెట్టే హక్కు లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలు గ్రహించి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అన్నిస్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ మోసాలు చూసి జిల్లా ప్రజలు సిగ్గుపడుతున్నారన్నారు. కుర్చీ వేసుకుని ప్రాజెక్టులు పూర్తి చేస్తానని, దత్తత తీసుకొని నల్లగొండలో అభివృద్ధి చేస్తానని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మోసపూరిత వాగ్దానాలు చేసి ప్రజలను నమ్మించిన కేసీఆర్ ఏముఖం పెట్టుకొని నల్లగొండకు వస్తాడని నిలదీశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విధంగా కేసీఆర్ ముక్కు నేలకు రాసి నల్లగొండలో అడుగుపెట్టి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల త్యాగాలు చూసి సోనియాగాంధీ తెలంగాణ ఏర్పాటు చేస్తే కేసీఆర్ దొరల పాలన సాగించాడని విమర్శించారు. ప్రజలకు ఏ మాయమాటలు చెప్పినా ఇంకా నమ్మేస్థితిలో లేరన్నారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌లు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో పాలన సాగించిందే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో నల్లగొండ జిల్లా ఎలాంటి అభివృద్ధికి నోచలేదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీలు మనిమద్దె సుమన్, నాగులవంచ విజయలక్ష్మి, నాయకులు జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్, నాంపల్లి భాగ్య, రేఖల భద్రాద్రి, బషీర్, సమద్, జూలకంటి శ్రీనివాస్, కత్తుల కోటి, ఇంతియాజ్, జూలకంటి సైదిరెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి, ఇబ్రహీం, దుబ్బరూప అశోక్‌సుందర్, నంద్యాల వీరబ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కేసీఆర్ గత హామీలను వింటున్న నేతలు

ప్రజల గుండెల్లో సంతోష్‌బాబు చిరస్మరణీయుడు


కల్నల్ సంతోష్ బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 13: దేశంకోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ కల్నల్ సంతోష్‌బాబు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్నల్ సంతోష్‌బాబు జయంతిని పురస్కరించుకొని సూర్యాపేటలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించి జగదీష్‌రెడ్డి మాట్లాడారు. నేటి యువత దేశ రక్షణకు ముందుకురావాలని సూచించారు. సంతోష్‌బాబు జీవితం ప్రతీఒక్కరికి ఆదర్శనీయమని సూచించారు. నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. దేశంగర్వించదగిన వ్యక్తి సంతోష్‌బాబు అని, దేశ సేవకై తన ప్రాణాలను అర్పించిన సంతోష్‌బాబును స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఒంటెద్దు నర్సింహారెడ్డి, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, తోటశ్యాం, కోటేశ్వరి పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల నివాళి

జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద సంతోష్‌బాబు సతీమణి డిప్యూటీ కలెక్టర్ సంతోషి నివాళులర్పించారు.కార్యక్రమంలో బిక్కుమళ్ల ఉపేందర్, మంజుల, వెంకటేశ్వర్లు, సంతోష్‌బాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే మేడిగడ్డ టూర్

- తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమై కేసీఆర్ మీద దాడి చేస్తున్నారు
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి
- నల్లగొండ సభకు ర్యాలీగా బయలుదేరిన శ్రేణులు


ఆటో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: కృష్ణా జలాల విషయంలో చేసిన తప్పును కప్పిపుచ్చుకుని ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ టూర్ పెట్టిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం నల్లగొండలో నిర్వహించిన బహిరంగ సభకు సూర్యాపేట నుంచి ఆటోవాలాలు ఏర్పాటు చేసిన ఆటో ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పును సరి చేసుకోకుండా ఎదురుదాడి చేస్తోందని విమర్శించారు. కృష్ణా జలాలపైన హక్కుల విషయంలో కాంగ్రెస్ వైఖరికి నిరసనగా మాత్రమే నల్లగొండలో సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా ఆటోవాలాలకు జరిగే నష్టాన్ని మాజీ సీఎం కేసీఆర్‌కు వివరించేందుకు ఆటో డ్రైవర్లు నల్లగొండకు వెళుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమైపోయాయని వివరించారు. అసెంబ్లీలో తీరానం పెట్టారంటే ఇన్ని రోజులు చెప్పినవన్నీ అబద్ధాలని తేలిపోయిందన్నారు. మేడిగడ్డ కాకుండా ఏ గడ్డకు పోయినా గండం నుంచి గట్టెక్కలేరని దుయ్యబట్టారు. తెలంగాణ వ్యతిరేకులంతా ఒక్కటై కేసీఆర్ మీద దాడి చేస్తున్నారన్నారు. తెలంగాణ హక్కులను కాలరాసే వారి చేతుల్లో ప్రభుత్వం కీలు బొమ్మలా మారుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జరుగుతున్న పరిణామాలను, కాంగ్రెస్ వైఖరిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. పదేళ్లుగా కేంద్రంతో యుద్ధం చేసి కాపాడిన హక్కులను కాంగ్రెస్ వదిలేస్తుందని స్పష్టం చేశారు. తమ పాలనలో వ్యవసాయంలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందన్నారు. నల్లగొండలో సభను అడ్డుకుంటామని ప్రగల్భాలు పలకడం మంచిదికాదన్నారు. కోమటిరెడ్డి సోదరులు స్వచ్ఛందంగా తరలివస్తున్న ప్రజల ప్రవాహంలో కొట్టుకుపోతారని స్పష్టం చేశారు. కార్యకర్తలను రెచ్చగొట్టేందుకు కోమటిరెడ్డి సోదరులు చెత్త మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, పార్టీ రాష్ట్ర నాయకుడు బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నల్లగొండ సభకు తరలివెళ్లిన శ్రేణులు

కృష్ణా జలాల హక్కులను పరిరక్షించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో ఏర్పాటు చేసిన సభకు జిల్లా కేంద్రం నుంచి పార్టీ నాయకులు తరలివెళ్లారు. పలు వాహనాల్లో మధ్యాహ్నం నుంచే బయలుదేరి వెళ్లారు.

మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి


జాతర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 13: వచ్చే నెల 8వ తేదీ నుంచి జరిగే మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై 14 శాఖల అధికారులతో ఆలయ ఈవో కొండారెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్డీవో శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజల్లో పాల్గొని మాట్లాడారు. జాతర నిర్వహణకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.50లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రత్యేక పాలన అధికారులు తమ దృష్టికి తేవాలని, ప్రతీ శాఖ అధికారి జాతర జరిగే ఐదు రోజులు అందుబాటులో ఉండాలన్నారు. పారిశుధ్య పనుల కోసం 150 మంది అదనపు సిబ్బంది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ జాతర ఐదు రోజులపాటు మూడు విడతలుగా సిబ్బంది పనిచేస్తారని చెప్పారు. సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందన్నారు. గతంలో 27 బస్సులు తిప్పామని, ఈ సారి అదనంగా 15 సర్వీసులతోపాటు మొత్తం 43 సర్వీసులను నడుపుతున్నామని, అవసరమైతే మరిన్ని సర్వీసులను నడుపుతామని తెలిపారు. పోలీస్ సిబ్బంది పార్కింగ్, శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తారని ఎస్ఐ పరమేష్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఆర్డీవో దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. మండల కేంద్రంలో ప్రధాని రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని, రంగుల రాట్నాలను నియంత్రించి సాధారణ భక్తులకు అందుబాటులో ఉండే విధంగా టికెట్ ధర నిర్ణయించాలని చెప్పారు. ప్రధాన రహదారిపై భారీ కటౌట్లు ఏర్పాటుచేయవద్దన్నారు. ఆలయ ఈవో మాట్లాడుతూ భక్తులకోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశామని, చలువ పందిళ్లు ఏర్పాటుచేస్తామని, అధికసంఖ్యలో అర్చకులను నియమించి, క్యూలైన్‌లోనే గోత్ర నామాలు, పూజలు నిర్వహిస్తామని, వీఐపీలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేస్తామని, బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం నాలుగు గంటల నుంచి ఏడు గంటలకు ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు. ఎంపీపీ కొట్టె పద్మ మాట్లాడుతూ జాతరను ప్రజా జాతరగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏడీ ఎం.వెంకన్న, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీవో వీరయ్య, మండల వైద్యాధికారి వేణుగోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాకునూరి భాస్కర్‌రెడ్డి, కొట్టె సైదేశ్వరరావు, గోవిందరెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ శంభయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ

ఉమ్మడి జిల్లాలో పలువురు పోలీస్ అధికారుల బదిలీ

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలలో చేపడుతున్న బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. తాజాగా పోలీస్‌శాఖలో పనిచేస్తున్న పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలైన పోలీస్ అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి.

పోలీస్ అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పీ.రమేష్‌కుమార్	సైబర్‌సెక్యూరిటీ డీఎస్పీ	యాదాద్రి ఏసీపీ
కే.శివరాంరెడి	ఏసీపీ, యాదాద్రి	ఎస్‌డీపీవో, నల్లగొండ
ఎం.శ్రీధర్‌రెడ్డి	ఎస్‌డీపీవో, నల్లగొండ	ఎస్‌డీపీవో, కోదాడ
జీ.ప్రకాష్	ఎస్‌డీపీవో, కోదాడ	డీటీసీ డీఎస్పీ ఆదిలాబాద్
మదన్‌మోహన్‌రెడ్డి	సీసీఎస్, హైదరాబాద్	డీఎస్పీ, ఎస్‌బీ, నల్లగొండ
జీఎస్ నారాయణ	డీఎస్పీ ఎస్‌బీ, నల్లగొండ	ఏసీపీ, సైబారాబాద్
వి.రవికుమార్	అదనపు డీసీపీ, యాదాద్రి	అదనపు ఎస్పీ, ఇంటలిజెన్స్
బి.రాములునాయక్	అదనపు ఎస్పీ, సంగారెడ్డి	అదనపు ఎస్పీ, నల్లగొండ

క్షేత్రపాలకుడికి శాస్త్రోక్తంగా
నాగవల్లీదళార్చన
రూ.22.65లక్షల ఆదాయం

తంబాకు కోసం
హత్య చేసిన వ్యక్తికి
జీవిత ఖైదు

●వివరాలు 5లో..

జేఈఈ మెయిన్స్‌లో జయ కళాశాల విద్యార్థుల ప్రతిభ



జయ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ జయవేణుగోపాల్

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్‌లో జిల్లాకేంద్రంలోని జయ కళాశాలకు చెందిన 21మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ఆ కళాశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. మంగళవారం సూర్యాపేటలోని ఆ కళాశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కళాశాల మొదటి బ్యాచ్‌లోనే 21మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో 90శాతానికిపైగా పర్సంటైల్ సాధించారని తెలిపారు. కె.వెంకటేష్ 99.75, జి.చందన 99.56, హర్షిణి 98.97, కె.సిద్దార్థన్ 98.57, విష్ణుతేజ 97.90, సాయిశివరంజన్‌రెడ్డి 97.64, జె.గౌతమ్ 97.36, ఎస్.దీక్షిత 97.21, టి.శ్రీలక్ష్మి 96.71, కె.అభిజిత్ 96.65, లాస్యశ్రీ 95.89, వివేక్‌రెడ్డి 95.41, రాంచరణ్ 95.24 శాతం పర్సంటైల్ సాధించారని తెలిపారు.

విద్యార్థులు కష్టప డి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. జయ కళాశాల స్థాపించిన మొదటి బ్యాచ్‌లోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బింగి జ్యోతి, పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో ఒకరు హోంగార్డు కాగా, మరొకరు రైతు, ఔట్‌సోర్సింగ్‌ఉద్యోగి, మేకలకాపరి, గుర్తు తెలియని వ్యక్తి ఉన్నారు.


కిషోర్(ఫైల్)

నల్లగొండ/నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13 : నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి చెందాడు. మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభ ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉన్న హోంగార్డును కారు ఢీకొనగా డివైడర్ దాటి పడిపోయాడు. అదే సమయంలో అటుగా వచ్చిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత ప్రయాణిస్తున్న కారు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో కారు సడన్ బ్రేక్ వేయడంతో ఎమ్మెల్యే నందితకు కూడా గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న కిషోర్(45)కు నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభకు సంబంధించి ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలను అప్పగించారు. నల్లగొండ పట్టణ పరిధిలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై చర్లపల్లి వద్ద చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శ్రీనుతో కలిసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి నల్లగొండ వైపు వస్తున్న కారు అతివేగంగా వస్తూ ముందు ఉన్న ట్రాలీ ఆటోను తప్పించబోయే క్రమంలో రోడ్డుపై ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న హోంగార్డు కిషోర్, కానిస్టేబుల్ శ్రీనులను బలంగా ఢీకొట్టింది. దీంతో కిషోర్ రోడ్డుకు అవతలి వైపు ఎగిరిపడగా అప్పుడే నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలై కిషోర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో కానిస్టేబుల్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న ఎమ్మెల్యే నందిత ముందుభాగాన్ని ఢీకొనడంతో స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఆమె మరో కారులో హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఇదిలాఉండగా హోంగార్డు కిషోర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారు ఢీకొట్టడంతో...

తిరుమలగిరి: సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి పట్టణ పరిధి మాలిపురం గ్రామానికి చెందిన జోగు ప్రసాద్(40) బీసీ హాస్టల్‌లో ఔట్ సోర్సింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో శుభమస్తు ఫంక్షన్ హాల్ వద్ద స్కూటీపై రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు స్కూటీని ఢీకొట్టడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు ఇద్దరు కుమార్తెలు కాగా, భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలంలోని బహాపేట స్టేజీ వరంగల్-హైదరాబాద్ జాతీయరహదారిపై తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తిప్పర్తి మండలంలో రైతు..


వెంకట్‌రెడ్డి మృతదేహం

తిప్పర్తి: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అంతయ్యగూడెం గ్రామానికి చెందిన రైతు సిరిగిరి వెంకట్‌రెడ్డి(45) మంగళవారం సాయంత్రం దుప్పలపల్లి వద్ద ఉన్న పొలానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు.ఈ క్రమంలో అంతయ్యగూడెం గ్రామస్టేజీ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న టీఎస్07జేఎస్ 3950 కారు వెనక నుంచి వేగంగా ఢీకొట్టడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటరెడ్డికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సతీష్ తెలిపారు.

కొత్తగూడెంలో బైక్ ఢీకొని మేకల కాపరి


అంజయ్య(ఫైల్)

మాడ్గులపల్లి : నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో బైక్ ఢీకొని మేకల కాపరి మృతి చెందాడు.ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన సింగం అంజయ్య(56) వ్యవసాయం చేస్తూనే మేకలు కాస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి కిరాణ సరుకుల కోసం నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి దాటుతుండగా నల్లగొండ వైపు వెళ్తున్న బైక్ అతివేగంతో అంజయ్యను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంజయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు జానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

వలిగొండ, ఫిబ్రవరి 13 : ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం మొగిలిపాక గ్రామానికి చెందిన గీతకార్మికుడు పబ్బు అయిలయ్య(48) ఈ నెల 6న ఇంట్లో టీ పెడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 12న రాత్రి మృతి చెందాడు. అయిలయ్య సోదరుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అయిలయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్షేత్రపాలకుడికి శాస్త్రోక్తంగా
నాగవల్లీదళార్చనలు


పాతగుట్ట ఆలయంలోని ఆంజనేయుడికి నాగవల్లీదళార్చనలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 13: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు ఆగమ శాస్త్ర రీతిలో కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి, అనుబంధ పాతగుట్ట, శివాలయంలో కొలువుదీరిన ఆంజనేయస్వామిని అర్చకస్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణం సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.22,65,293 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

గులాబీలో జోష్

- కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించిన నాయకులు, అభిమానులు
- నల్లగొండ ప్రధాన రహదారి గులాబీ జెండాల మయం
- ఈలలు, కేరింతలతో సభలో కార్యకర్తల హల్‌చల్


సభకు హాజరైన ప్రజలు, అభిమానులు


మాజీ మంత్రి ఎర్రబెల్లితో ముచ్చటిస్తున్న సూర్యాపేట, యాదాద్రి జిల్లా జడ్పీ చైర్మన్లు సందీప్‌రెడ్డి, దీపిక


వేదికపై జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, రవీంద్రనాయక్, భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి అజయ్‌కుమార్


వేదికపై జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే సునీత, గాదరి కిషోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, మునుగోడుకు చెందిన రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి


వేదికపై కేటీఆర్‌తో అభిమాని సెల్ఫీ


తిరుగు ప్రయాణంలో హెలీకాప్టర్ నుంచి అభివాదం చేస్తున్న కేసీఆర్

పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం

నల్లగొండ, ఫిబ్రవరి 13: నల్లగొండ పట్టణంలో బీఆర్ఎస్ సభతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తల, నాయకుల వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలపడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు, దేవరకొండ రోడ్డు, పానగల్లు రోడ్డు, నార్కట్‌పల్లి రోడ్డు ప్రాంతాల్లో వివిధ జిల్లాల నుంచి వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ప్రయాణిస్తున్న బస్సును ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు అడ్డుకున్న సమయంలో, ప్రాంగణానికి చేరకున్న సమయంలో ట్రాఫిక్‌లో బస్సు చిక్కుకుపోయింది. దేవరకొండ రోడ్డు మార్గం గుండా వచ్చిన వాహనాలను లక్ష్మీగార్డెన్స్, ఎల్లమ్మగుడి సమీపంలో, చర్లపల్లి సమీపంలో వాహనాలను పార్కింగ్ చేయించారు. సూర్యాపేట, మిర్యాలగూడ నుంచి వచ్చిన వాహనాలను ఆర్జాలబావి ఐకేపీ కేంద్రాల వద్ద ప్రాంతాలతో పాటు మరో మూడు చోట్ల వాహనాలను నిలిపివేశారు. పలు చోట్ల లారీలను డీసీఎంలను రోడ్ల వెంట నిలిపివేయడంతో పోలీసులు వాహనాలను పార్కింగ్ ప్రాంతాలకు తరలించేలా చేశారు. అంబులెన్స్‌లకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పు పోలీసులు చర్యలు తీసుకున్నారు.

కేసీఆర్ సభ సైడ్‌లైట్స్


సభా ప్రాంగణంలో ఈల వేస్తున్న కార్యకర్త

- గడియారం సెంటర్ నుంచి మర్రిగూడ బైపాస్ వరకు కట్టిన బీఆర్ఎస్ పార్టీ తోరణాలతో ప్రధాన రహదారి గులాబిమయమైంది.
- కార్యకర్తల వాహనాలతో బైపాస్ రోడ్డు ట్రాఫిక్ జామ్ కాగా, ఇదే సమయంలో ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- మధ్యాహ్నం 2 గంటల నుండే వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- కళాకారులు తమ ఆటపాటలతో కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.
- సాయింత్రం 4.48 నిమిషాలకు కేసీఆర్ హెలికాప్టర్ సభా ప్రాంగణం కొంత దూరంలో దిగింది.
- 4.59 నిమిషాలకు కేసీఆర్ కార్యకర్తలకు అభివాదం చేస్తూ వాకర్ సాయంతో వేదికపైకి వచ్చారు.
- 5.09 నిమిషాలకు జై తెలంగాణ నినాదంతో ప్రసంగం ప్రారంభించిన కేసీఆర్, 5.49 నిమిషాల వరకు 40 నిమిషాల పాటు ప్రసంగించారు.
- కేసీఆర్‌ను చూసేందుకు, ప్రసంగాన్ని వినేందుకు వేదికకు ఎదురుగా ఉన్న భవనంపై కొంతమంది కార్యకర్తలు ప్రమాదాన్ని కూడా లెక్క చేయకుండా ఎక్కి ఆసక్తి కనపరిచారు.
- కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో సౌండ్ సిస్టమ్ మొరాయించడంతో సభలో కూర్చున్న హరీశ్‌రావు లేచి వచ్చి సౌండ్ సిస్టమ్‌ను సరి చేయించారు.
- అదేపనిగా సౌండ్ సిస్టమ్ అంతరాయం కలగడంతో కేసీఆర్ కలుగజేసుకుని కొంపతీసి నీవు అక్కడోనివా అంటూ సౌండ్ సిస్టమ్ నిర్వాహకుడిని అనడం సభలో ఉన్న కార్యకర్తలను నవ్వించింది.
- సభలో కొంతమంది కార్యకర్తలు ఈలలు వేస్తూ అంతరాయం కలిగిస్తుండగా ఏయ్..! ఎవడయ్యా వాడు... ఆపు ఆపు అంటూ కేసీఆర్ హెచ్చరించారు.
- ప్రతిపక్షాలపై సామెతలు, తిట్లతో కేసీఆర్ ప్రసంగం సాగింది.
- కేసీఆర్ ప్రసంగిస్తుండగా కార్యకర్తలు అత్యుత్సాహంతో ఈలలు వేస్తుండటంతో వారిని ఆపడం పోలీసుల తరం కాలేదు. దీంతో చేయి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- కేసీఆర్ ప్రసంగం నడుస్తుండగానే దూర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు తిరుగుముఖం పట్టడం కనిపించింది.

● రామగిరి




సభా ప్రాంగణంలో సమీపంలోని కటౌట్, భవంతి ఎక్కి తిలకిస్తున్న కార్యకర్తలు


కేసీఆర్ వేదిక పైనుంచి దిగి వస్తుండగా సెల్‌ఫోన్లలో బంధిస్తున్న అభిమానులు


జీవో 46ను రద్దు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కానిస్టేబుళ్ల అభ్యర్థులు


హెలీప్యాడ్ వద్ద మాజీ సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి

కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికిన నేతలు

నల్లగొండ, ఫిబ్రవరి 13 : కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన చలో నల్లగొండ సభకు హాజరైన మాజీ సీఎం కేసీఆర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ తక్కెనపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.


వేదిక వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి

బీఆర్ఎస్ నేతలకు నిరసన సెగ



నల్లగొండలో బీఆర్ఎస్ నాయకుల బస్సుపై కోడిగుడ్లను విసిరిన ఎన్ఎస్‌యూఐ నాయకులు



బస్సును అడ్డుకుంటున్న ఎన్ఎస్‌యూఐ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తంబాకు కోసం హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

మిర్యాలగూడ లీగల్, ఫిబ్రవరి 13 : తంబాకు ఇవ్వలేదని తోటి వ్యక్తిని బండరాయితో కొట్టి చంపిన వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదు, జరిమానా విధించింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్ గుప్తాపై హత్యా నేరం రుజువు కావడంతో జీవితఖైదు, రూ.500 జరిమానా విధిస్తూ మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జీ వేణు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్లలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో యాష్ ప్లాంట్ నిర్మాణానికి బెకం కంపెనీ బీహార్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 300 మంది కార్మికులను పనుల్లోకి తీసుకుంది. వీరిలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రఘునందన్‌రామ్ కార్పెంటర్‌గా, బీహార్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్‌గుప్తా హెల్పర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. మద్యానికి, ఖైనీ(తంబాకు)కు బానిసైన ఓంప్రకాశ్‌గుప్తా విధులకు సక్రమంగా హాజరు కాకపోయేవాడు. ఈ క్రమంలో 2023 ఏప్రిల్ 24న మధ్యాహ్నం ప్లాంట్ సమీపంలో ఉన్న రఘునందన్‌రామ్ దగ్గర ఖైనీ(తంబాకు) ప్యాకెట్ ఉన్నది చూసి కొద్దిగా ఖైనీ ఇవ్వమని ఓంప్రకాశ్‌గుప్తా అడిగాడు. దీంతో రఘునందన్‌రామ్ ఇవ్వనంటూ బూతులు తిడుతూ ప్లాంట్ వైపు వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న ఓంప్రకాశ్‌గుప్తా కోపంతో పక్కనే ఉన్న బండరాయితో అతడి తలపైన కొట్టి చంపాడు. ఘటనపై జనరల్ మేనేజర్ బండారు రంగనాథ్ ఫిర్యాదు మేరకు అప్పటి వాడపల్లి హెడ్‌కానిస్టేబుల్ అహ్మద్ హత్యానేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, అప్పటి మిర్యాలగూడ రూరల్ సీఐ ఎం.సత్యనారాయణ దర్యాప్తు పూర్తి చేసి నిందితుడు ఓంప్రకాశ్‌గుప్తాను హత్యానేరం కింద అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచాడు. 12మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం ఓంప్రకాశ్‌గుప్తాకు జీవతఖైదు, జరిమానా విధించింది.

జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. నిందితుడు ఓంప్రకాశ్‌గుప్తా జ్యుడిషియల్ రిమాండ్‌లోనే ఉన్నందున శిక్షా కాలంలో కస్టడీ కాలాన్ని మినహాయించాలని న్యాయమూర్తి తన తీర్పులో వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పీపీ మన్నెం మనోహర్‌రెడ్డి కేసు వాదించారు. ప్రాసిక్యూషన్‌కు వాడపల్లి కోర్టు కానిస్టేబుల్ ఎంఏ యూనిస్, కోర్టు లైజన్ అధికారి సైదులు సహకరించారు.

జోరుగా మట్టి తవ్వకాలు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 13: మండలంలో నెల రోజులుగా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. దళారులు నాలుగు గ్రూపులుగా ఏర్పడి జోరుగా మట్టి దందా చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వాలంటే మైనింగ్ శాఖకు క్యూబిక్ మీటర్‌కు కొంత డబ్బు చెల్లించాలి. పట్టా భూమిలో ఉన్న మట్టిని తరలించాలన్నా మైనింగ్ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఈ నిబంధనలు పాటించకుండా గుట్టలు, చెరువులు, ప్రభుత్వ భూములను ఎడాపెడా ఎక్స్‌కవేటర్ల ద్వారా తవ్వుతూ, టిప్పర్ల ద్వారా వెంచర్లకు తరలిస్తున్నారు. రోజూ మట్టి దందా కొనసాగుతున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో మట్టిని నిరాటంకంగా తరలిస్తున్నారు.

ఏ ప్రభుత్వం వచ్చినా ఆటకం లేకుండా...

గుడిబండ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.198లో ఐదు ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో నాలుగైదు రోజులుగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దళారులు వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ తమ మట్టి దందాకు ఆటంకం లేకుండా చూసుకుంటున్నారు. మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. అయినా మట్టి అక్రమంగా తరలిపోతోంది.

తరలింపు వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు

మండలంలోని గుడిబండ, కాపుగల్లు, తొగర్రాయి, దోరకుంట, నల్లబండగూడెం గ్రామాల్లో పరిధిలో వందలాది ఎకరాల్లో ప్రభుత్వ భూములు, గుట్టలు ఉన్నాయి. వీటిపై మట్టి దళారుల కన్నేసి రేయింబవళ్లు మట్టిని తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు. ఎవరైనా నిలదీస్తే అధికారులు తమకు అన్నిరకాల అనుమతులిచ్చారని దళారులు బుకాయిస్తున్నారు.

మట్టిని అక్రమంగా తరలించే వాహనాలను గుడిబండ, తొగర్రాయి గ్రామస్థులు ఇటీవల అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామాల నుంచి ఎటువంటి మట్టిని తరలించవద్దని కాపుగల్లు గ్రామానికి చెందిన కొంత మంది రైతులు టిప్పర్లకు అడ్డుకోవడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తహసీల్దార్‌కు సమాచారం అందించారు. రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మట్టి వ్యాపారులను కేవలం మందలించి పంపివేశారని, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎక్స్‌కవేటర్ ద్వారా మట్టిని తవ్వి టిప్పర్‌లో నింపుతున్న కార్మికుడు

మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు రెండు ప్రత్యేక టీంలు



అనంతగిరి, కోదాడ మండలాల్లో ప్రభుత్వ భూములు, పట్టా భూముల నుంచి మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదు అందింది. మట్టి తవ్వకాలకు మేము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు ఇచ్చే అధికారం కూడా మాకు లేదు. మైనింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే మట్టిని తరలించాలి, మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశాం.

● సూర్యనారాయణ, ఆర్డీవో

మార్కెట్ ప్రత్యేక అధికారిగా సబిత



సబిత

తిరుమలగిరి, ఫిబ్రవరి 13: తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ ప్రత్యేక అధికారిగా సబిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ చైర్మన్ పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. యాదాద్రి భువనగిరి జిల్లా మార్కెటింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తూ, తిరుమలగిరి మార్కెట్ ప్రత్యేక అధికారిగా సబిత బాధ్యతలు స్వీకరించారు.

స్టేను రద్దు చేసిన హైకోర్టు

నడిగూడెం, ఫిబ్రవరి 13: నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించడానికి సిద్ధపడగా, సహకార టిబ్యునల్ నుంచి చైర్మన్ పుట్ట రమేష్ తెచ్చిన స్టేను హైకోర్టు రద్దు చేసింది. దీంతో ఈ నెల 29న పాలకవర్గ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సహకార అధికారి నామ శ్రీధర్ డైరెక్టర్లుకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. చైర్మన్ రమేష్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని, సంఘం నిధులను దుర్వినియోగం చేశాడని, సభ్యుల తీర్మానం లేకుండానే నిధులు డ్రా చేశాడని జిల్లా అధికారులకు తొమ్మిది మంది డైరెక్టర్లు డిసెంబరు 29న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశాన్ని జనవరి 20న ఏర్పాటు చేశారు. కాగా, సహకార టిబ్యునల్‌ను చైర్మన్ రమేష్ ఆశ్రయించి స్టే తేవడంతో అవిశ్వాస తీర్మాన సమావేశం వాయిదా పడింది. దీంతో జిల్లా సహకార అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. సహకార ట్రిబ్యునల్ ఇచ్చి స్టేను రద్దు చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఈనెల 29న ప్రత్యేక సమావేశానికి సభ్యులంతా హజరు కావాలని జిల్లా సహకార అధికారి శ్రీధర్ డైరెక్టర్లను నోటీసులు జారీ చేశారు.

16న మునిసిపల్ బడ్జెట్ సమావేశం

తిరుమలగిరి, ఫిబ్రవరి 13: తిరుమలగిరి మునిసిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజని తెలిపారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. అధికారులతో కలిసి బడ్జెట్ డ్రాఫ్టు రూపొందించినట్లు తెలిపారు. మీటింగ్ ప్రతులను కలెక్టర్, ఎమ్మెల్యేకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్ ధనుంజయ, మేనేజర్ బుచ్చిబాబు, జూనియర్ అసిస్టెంట్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 13: ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, బూరుగడ్డ మాజీ సర్పంచ్ రాధికదేశ్‌ముఖ్ అన్నారు. మంగళవారం మండలంలోని బూరుగడ్డ గ్రామంలో మంత్రి ఉత్తమ్ మంజూరు చేసిన రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, బిక్షం, నాగయ్య, సైదులు, వెంకయ్య, వీరబాబు, గురవయ్య, ఆదెమ్మ, మట్టపల్లి, కొండలు, సైదులు, శివాజీ, నాగరాజు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌పై దాడి చేయడం అమానుషం

హుజూర్‌నగర్, నేరేడుచర్ల ఫిబ్రవరి 13: మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములుగుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాచకొండ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో అనంతరాములుగుప్తా, నేరేడుచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడారు. గిట్టుబాటు ధర రానట్లయితే అధికారులు రైతులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని, దాడులు చేయడం సరికాదన్నారు. దాడులు చేసిన వారిని వెంటనే శిక్షించాలన్నారు. సమావేశంలో బండారు రాజా, తెల్లాకుల వెంకటేశ్వర్లు, మీలా వంశీ, గుండా శ్రీదేవి, రాచకొండ రామ్మోహన్‌రావు, పాల్వాయి రమేష్, గరిణె అరుణకుమారి, వాసంతి, కొత్త లక్ష్మణ్, శ్రీలత పాల్గొన్నారు.

సరోజినీనాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి

కోదాడ, ఫిబ్రవరి 13: మహిళా సమస్యలపై అసమాన పోరాటం చేసిన కవయిత్రి సరోజినీ నాయుడిని యువతులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఎస్ విద్యాసంస్థల సీఈవో ఎస్ఎస్‌రావు అన్నారు. సరోజినీ నాయుడి జయంతిని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో మహిళా అధ్యాపకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సునీత, మమత, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సరోజినీ నాయుడి ఆశయాలు సాధించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి అన్నారు. పట్టణంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో గాయత్రి, భాస్కర్, సతీష్‌నాగేశ్వరరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

లైబ్రేరియన్ విభాగంలో జిల్లా వాసికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు



రవి

తిరుమలగిరి, ఫిబ్రవరి 13: లైబ్రేరియన్ పరీక్షా ఫలితాల్లో తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన చెందిన గడ్డం రవి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. అలాగే పీజీటీలో స్టేట్ 4వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నెట్, జేఆర్ఎఫ్‌కు క్వాలిఫై అయినట్లు తెలిపారు. తల్లిదండ్రులు గడ్డం ఉప్పలయ్య -భద్రమ్మలు రైతు, కల్లుగీత కార్మికులు. తమ కుమారుడు రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థిని మృతిపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ఇమాంపేట గురుకుల వసతి గృహంలో విద్యార్థిని వైష్ణవి అనుమానాస్పద మృతిపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని ధర్మసమాజ్‌పార్టీ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌మహరాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వైష్ణవి కుటుంబానికి న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైష్ణవి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.కోటి రూపా ఎక్స్‌గ్రేషియా అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, సూరపల్లి సైదులు, సూరారపు రమేష్, పేరాల శ్రీనివాస్, వినీత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి: మంత్రి



కౌన్సిలర్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఉత్తమ్ నివాసంలో బీఆర్ఎస్‌కు చెందిన 19వ వార్డు కౌన్సిలర్ అట్లూరి మంజుల, 6వ వార్డు కౌన్సిలర్ ముల్కలపల్లి రామ్‌గోపి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, యరగాని నాగన్నగౌడ్, ఈడ్పుగంటి సుబ్బారావు, ఎండీ నిజాముద్దీన్, అమరబోయిన సతీష్‌ముదిరాజ్, శివరామ్‌యాదవ్ పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 13: అవయదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కల్నల్ సంతోష్‌బాబు తండ్రి బిక్కుమళ్ల ఉపేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో అవయవదాన అంగీకారపత్రాన్ని స్పందన అవయవదాన సంస్థ సభ్యులకు అందజేసి మాట్లాడారు. కల్నల్ సంతోష్‌బాబు 41వ జయంతి సందర్భంగా అవయవదానానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పందన అవయవదాన సంస్థ అధ్యక్షుడు అధ్యక్షుడు గుండా రమేష్, ప్రధాన కార్యదర్శి కోటయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

16నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 13: చింతలపాలెం మండల కేంద్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి 19 వరకు జరిగే రాష్ట్ర స్థాయి 33వ సబ్‌జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌కు విజయవంతం చేయాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చింతలపాలెంలో ఈ పోటీల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు అనంతరం గ్రౌండ్, క్రీడాకారుల వసతి భవనాలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా డీఈవో అశోక్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి, ఎంఈవో సైదా, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రగౌడ్, కార్యదర్శి రామనర్సింహారావు, రామిరెడ్డి ఉన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

మోతె, ఫిబ్రవరి 13: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి భద్రతా అధికారి అభిజిత్ సింగ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రోడ్డు నియమనిబంధనల ఫ్లెక్సీతో మంగళవారం మోతె మండల కేంద్రంతో జాతీయ రహదారి భద్రతా సిబ్బంది, పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి బొర్రాజు సతీష్, చందు పాల్గొన్నారు.

మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

నేరేడుచర్ల, ఫిబ్రవరి 13: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నేరేడుచర్ల మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, వైస్ చైర్‌పర్సన్ అలుక సరిత తెలిపారు. మంగళవారం నేరేడుచర్లలో వారు మాట్లాడుతూ గతంలో మునిసిపాలిటీ పాలకులు చేసిన తప్పులు చేయకుండా అందరి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మునిసిపాలిటీలో జరిగే ప్రతి సమావేశానికి, అభివృద్ధి పనులకు మీడియా సహకారం కూడా తీసుకుంటామన్నారు. సమస్యను పాలకమండలి దృష్టికి తీసుకు వస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. మొదట తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు రాజకీయాలకు అతీతంగా మునిసిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. తమకు అవకాశం కల్పించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

బంద్‌ను విజయవంతం చేయాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 13: జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో ఈనెల 16వ తేదీన నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం సూర్యాపేటలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలతో ప్రతి ఒక్కరికీ అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, రాజారాం, శ్రీను, పాషా పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిరసనగా ఈనెల 16వ తేదీన నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డేవిడ్‌కుమార్, గంట నాగయ్య, పి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష నాయకులు కోరారు. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో ప్రభుత్వ అధికారులను కలిసి బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

హుజూర్‌నగర్: బంద్‌ను విజయవంతం చేయాలని పట్టణంలో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వరరావు, రైతు సంఘం అధ్యక్షుడు కంబాల శ్రీనివాసు, సీపీఎం రాష్ట్ర నాయకుడు పల్లె వెంకటరెడ్డి, టీపీసీసీ సభ్యులు దొంగరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు, ముత్యాల భాస్కర్, వెంకట్ మాట్లాడారు.

చిలుకూరు: మండల కేంద్రంలో సమ్మె నోటీసును ఎస్ఐ రాంబాబుకు సీపీఎం నాయకుడు వేనేపల్లి వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగటి రాములు పాల్గొన్నారు.

మద్దిరాల: సమ్మె కరపత్రాలను మద్దిరాల మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మట్టిపెల్లి సైదులు, కోట గోపి, పులుసు సత్యం, కల్లెపల్లి భాస్కర్, పాల్వాయి కవిత పాల్గొన్నారు.

మఠంపల్లి: మండల కేంద్రంలో సమ్మె పోస్టర్లను ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.నవీన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, శ్రీను, నాగమణి, రమాదేవి, హారిక, పాల్గొన్నారు.

నూతన్‌కల్: గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో కరపత్రాలను ఐఎఫ్‌టీయూ మండల అధ్యక్షుడు ఎస్‌కే బాబుజాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మూరగుండ్ల మధు మరికంటి సైదులు, వీరబాబు, రవి, వెంకన్న, హుస్సేన్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ-జేఈఈలో 'తేజ' పూర్వ విద్యార్థి ప్రతిభ



ప్రశాంత్‌రెడ్డి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 13: ఐఐటీ-జేఈఈ పరీక్ష ఫలితాల్లో మండలంలోని కొమరబండ తేజ విద్యాలయం 2021-22బ్యాచ్ పదో తరగతి విద్యార్థి ఉస్తెల ప్రశాంత్‌రెడి 99.41 పర్సెంటైల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఆమె మాట్లాడుతూ హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబమన్నారు. 2021లో పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఫిట్ ఇండియా క్విజ్‌లో రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచాడన్నారు.

ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

చివ్వెంల: మండలంలోని దురాజ్‌పల్లిలో ఉన్న ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థి డేనియల్ నిస్సీ జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చాడని ఆ పాఠశాల కరస్పాండెంట్ కొల్లు శ్రీనివాస్ ఒక ప్రకటలో తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో 99.425పర్సంటైల్ సాధించినట్లు ఆయన వెల్లడించారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో సంత్‌సేవాలాల్ జయంతి

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 13:ప్రభుత్వం ఆధ్వర్యంలో సంత్‌సేవాలాల్ జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో జగదీశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గిరిజనులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజవర్గంలో సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాలను ప్రభుత్వం ఈ నెల 15 నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిని విజయవంతం చేసేందుకు గిరిజనులు సహకరించాలన్నారు.. కార్యక్రమంలో పాలకవీడు ఎంపీపీ భూక్యా గోపాల్, మంజూనాయక్, సైదులునాయక్, నవీన్‌నాయక్, నాగరాజు, పాండు, భీముడు, శ్రీను, పద్మ, వెంకట్, పాల్గొన్నారు.

రూ.18లక్షలు తీసుకుని పరారీ

చిలుకూరు, ఫిబ్రవరి 13: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి తమ నుంచి రూ.18లక్షలు తీసుకుని పరారయ్యాడని ఆ గ్రామస్థులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటికి వెళితే తాళం వేసి ఉందని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సత్యనారాయణ, లింగయ్య, సురేష్, రామారావు, కిషోర్, పద్మ తదితరులు ఉన్నారు.



హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన చరమందరాజును మంగళవారం పలు పార్టీల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో అజీజ్‌పాషా, సుబ్బరాజు, మట్టయ్యఉన్నారు.

మఠంపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్యశాలలో పశు వులు, జీవాల గర్భకోశ వ్యాధుల నివారణ కోసం బుధవారం వైద్య శిబి రాన్ని నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి శంకర్ కట్టా తెలిపారు. ఎదకు రాని, చూడి కట్టని పశువులను వైద్యశాలకు తీసుకువస్తే సమస్యను గుర్తించి చికిత్స చేస్తామన్నారు

● మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం లక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు పాల్గొన్నారు.

గరిడేపల్లి: నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నాలుగు గ్రామాల్లో పదో తరగతి విద్యార్థుల అల్పాహారం కోసం దాతలు ఆర్థికసాయం అందించారు. గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఎంఈవో పానుగోతు చత్రునాయక్‌కు ఎంపీపీ పెండెం సుజాత శ్రీనివాస్‌గౌడ్ రూ.10వేలు అందజేశారు. పొనుగోడు పాఠశాలకు ఉపాధ్యాయుడు సుందరి కృష్ణయ్య, గానుగుబండ పాఠశాలకు నీల శ్రీనివాస్, కల్మలచెర్వు ప్రభుత్వ పాఠశాలకు రాచకొండ శబరీష్ రూ.5వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి జిలకర రామస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: ఉస్మానియా యూనివర్శిటీ రిటైర్డు ప్రొఫెసర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు, కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన నాయకుడు ముండ్రా ఆదినారాయణ గుండపోటుతో మంగవారం మృతి చెందారు. ఆయన మృతికి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అందె సత్యం, ఎస్వీ కళాశాల చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు, న్యాయవాది ఎస్ఆర్‌కే మూర్తి, మేకల వెంకట్రావు, డీఎల్ స్వామి తదితరులు సంతాపం తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మోతె: మండలంలోని సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను దానదర్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు సుంకర సరేష్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్‌రావు, ఉపాధ్యాయులు శ్రీను, చారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుమలగిరి: మండల కేంద్రంలో ఈనెల 15న నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలని సంత్ సేవాలాల్ కమిటీ గౌరవ అధ్యక్షుడు దరావత్ జుమ్మీలాల్ కోరారు. మంగళవారం తిరుమల గిరిలో కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో రాములునాయక్, కిష్టునాయక్, రాజునాయక్, మోహన్, రవి, రాజశేఖర్, పాల్గొన్నారు.

కోదాడ: సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆర్డీవో సూర్యనారాయణ కోరారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన గిరిజన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో సైదానాయక్, ఆర్జినాయక్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని ఎర్రవరం గ్రామంలోని దూలగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధికి సహకరిస్తాని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొని, అనంతరం మాట్లాడారు.

మునగాల రూరల్: మండలంలోని నేలమర్రి గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తామని కాంగ్రెస్ పార్టీ మండలప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, గ్రామశాఖ అధ్యక్షుడు నలబోలు సతీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని నేలమర్రి గ్రామంలో ఎమ్మెల్యే పద్మావతి నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ దేవస్థానం చైర్మన్ నలబోలు లింగారెడ్డి, బిక్షంరెడ్డి పాల్గొన్నారు.

చిలుకూరు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సంక్రాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాగరాజు పాల్గొన్నారు.

మద్దిరాల: విధుల్లో అంకితభావంతో పనిచేసే సిబ్బందికే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఎస్ఐ మధునాయుడు అన్నారు. మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్లు విధులు నిర్వహించి బదిలీ అయిన కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సైదులు, సతీష్‌యాదవ్, నారాయణరెడ్డిని సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎలిపెద్ది మల్లారెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

అర్వపల్లి: సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి అన్నారు. అర్వపల్లి తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లో పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ మహేందర్‌నాథ్, రాంమూర్తి పాల్గొన్నారు.

నాగారం: సీఐగా, ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఈ.రఘువీర్‌రెడ్డి, పి. వెంకట్‌రెడ్డిని మంగళవారం సర్కిల్ కార్యాలయంలో సమాచార హక్కు సమితి జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు సమితి క్యాలెండర్‌ను సీఐ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాంమూర్తి, ప్రశాంత్ పాల్గొన్నారు.

అర్వపల్లి, తుంగతుర్తి, తిరుమలగిరి, పెన్‌పహాడ్, నాగారం: నల్లగొండ జిల్లా కేంద్రంలో కేసీఆర్ బహిరంగ సభకు జిల్లాలోని పలు మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అర్వపల్లిలో జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, తుంగతుర్తి లో ఎంపీపీ కవిత, తిరుమలిగిరిలో రఘనందన్‌రెడ్డి, పెన్‌పహాడ్‌లో జూలకంటి వెంకట్‌రెడ్డి, నాగారంలో ఉప్పలయ్య ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

ఇద్దరు దొంగల అరెస్టు, రిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ పరిక నాగభూషణం

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 13: బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సూర్యాపేట డీఎస్పీ పరిక నాగభూషణం తెలిపారు. పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన గొబ్బి సందీప్, రేడపంగి యశ్వంత్ మంగళవారం ఉదయం 9 గంటలకు మోటర్ సైకిల్‌పై మాచారం గ్రామం నుంచి పెన్‌పహాడ్ వైపునకు అతివేగంగా వెళ్తున్నారు. వీరిని పొట్లపహాడ్ క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ పెరిక రవీందర్, కానిస్టేబుల్స్ ప్రవీణ్, లింగయ్య, రవిలు వెంబడించి పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా బైక్ నడుపుతున్న గొబ్బి సందీప్ ప్యాంట్ జేబులో ప్లాస్టిక్ కవరులో 30 గ్రాముల బంగారు గొలుసు, 15 గ్రాముల మూడు చెవిదిద్దులు, 10 గ్రాముల రెండు ఉంగరాలు, 20 గ్రాముల బంగారు బిస్కెట్(సుమారు రూ.5లక్షల విలువైన మొత్తం ఏడున్నర తులాల బంగారం)ను గుర్తించి అనుమానంతో వాటితో పాటు మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా, 2023 మే 25 తేదీన చీదెళ్ల గ్రామంలో వంగవీటి శ్రవణ్‌కుమార్ ఇంటోట్ల ఈ ఆభరణాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. చోరీ చేసిన వెంటనే ఆభరణాలను విక్రయిస్తే అందరికీ అనుమానం వస్తుందనే ఉద్దేశంతో పాతమరుపుఅయిన తర్వాత విక్రయించవచ్చని ఇన్ని రోజులు వాటిని వారి దగ్గరే ఉంచుకున్నారని మంగళవారం సూర్యాపేటలో విక్రయించి వద్దామని బయలు దేరగా చిక్కినట్లు డీఎస్పీ తెలిపారు. బంగారు నగలు, మోటర్ సైకిల్‌ను స్వాధీనపర్చుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. చోరీ చేసిన వ్యక్తులను పట్టుకున్న ఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ పెరక రవీందర్, ఏఎస్ఐ వెంకటరత్నం, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్స్ ప్రవీణ్, లింగయ్య, రమేష్, రవి, వెంకటేశ్వర్లు, బోసు పాల్గొన్నారు.

క్రైం పాయింట్ Crime point

పాత కక్షలతో దాడి, వ్యక్తికి తీవ్రగాయాలు

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 13 : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలో పాతకక్షలతో జరిపిన దాడిలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సైదులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో సోమవారం తాటి చెట్టు ఎక్కి వస్తున్న కాట్ల సందీప్(25)ను అదే గ్రామానికి చెందిన ఎరగానీ లింగయ్య కల్లు గీసే కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ప్రమాదంలో సందీప్ తల, మెడ, వీపుపై గాయాలయ్యాయి. సందీప్‌ను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. సందీప్, లింగయ్య మధ్య కొంతకాలంగా కుటుంబ వివాదలు ఉన్నాయని, పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా నడిచినట్లు తెలిపారు. సందీప్ సోదరుడు కాట్ల లింగయ్య ఫిర్యాదు మేరకు హత్యా నేరం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

క్రషర్ మిల్లుల్లో నిబంధనలు

అతిక్రమిస్తే కఠిన చర్యలు

చివ్వెంల, ఫిబ్రవరి 13 : క్రషర్ మిల్ యజమానులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడీ బీవీ వెంకటరమణ తెలిపారు. మండలంలోని ఉండ్రుగొండ గ్రామంలోని ఎస్‌జే రెడ్డి క్రషర్ మిల్లును స్థానిక ప్రజల ఫిర్యాదుమేరకు మైనింగ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఎస్‌జే రెడ్డి క్రషర్ మిల్లులో తనిఖీలు నిర్వహించామన్నారు. క్వారీ కొలతలు వేస్తున్నామన్నారు. అదేవిధంగా క్రషర్ మిల్లు పరిసరప్రాంతాల్లో డంపు చేసిన మెటీరియల్‌ను సర్వే చేస్తున్నామన్నారు. మూడు రోజుల్లో సర్వే రిపోర్టు వచ్చిన వెంటనే ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ శంకర్‌బాబు, డీఎస్పీ నాగభూషణం, మైనింగ్ ఆర్ఐ కృష్ణమరాజు, సర్వేయర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రంగారావు, ఆర్ఐ రామారావు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా అధికారులు తనిఖీలకు వస్తున్న విషయం తెలుసుకున్న ప్రజలు క్రషర్ మిల్లు ప్రదేశానికి తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ వెంకటరెడ్డి బందోబస్తు నిర్వహించారు.